నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 22 మే 2025 | NIZAMABAD

# భారీ వర్షం

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- రామారెడ్డిలో ఇండ్లలోకి చేరిన నీరు
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు



నిండుగా పారుతున్న గడ్కోల్ గుంతల ఒర్రె

కామారెడ్డి, మే 21: ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి, బుధవారం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. పంట కొనుగోలు చేయడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డిలోని గంజ్‌మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం వర్షంతో పూర్తిగా తడిసింది. రైతులు బుధవారం ధాన్యాన్ని ఆరపెట్టేందుకు నానా కష్టాలు పడ్డారు. రామారెడ్డిలో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. ప్రజలు బకెట్లతో నీటిని తోడిపోశారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పెండ్లి కోసం ఏర్పాట్లు చేసుకోగా.. వర్షంతో నీరు నిలిచింది. దీంతో వివాహాన్ని మరో ప్రదేశంలో జరిపించారు. వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. లింగంపేటలోని పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. సిరికొండ మండలం తూంపల్లి కప్పల వాగుకు వరద వచ్చింది. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి వాగు బుధవారం ఉదయం నుంచి నీటితో ఉధృతంగా ప్రవహించింది. కోటగిరి మండల కేంద్రంలో మురికి కాలువలను అధికారులు పొక్లెయిన్ సహాయంతో శుభ్రం చేయించారు. భారీ వర్షంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పొగాకు గట్టలు తడిసిపోయాయి. కాగా ఇన్నిరోజులు ఉక్కపోతతో బాధపడగా.. వాతావరణం ఒక్కసారిగా చల్లబడిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రామారెడ్డిలో ఇంట్లోకి చేరిన నీరు



ఇందల్వాయి మండలంలో ప్రవహిస్తున్న సిర్నాపల్లి వాగు



కామారెడ్డి గంజ్‌లో ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ



కామారెడ్డి గంజ్‌లో నీటిలో తడిసిన ధాన్యం



కామారెడ్డి గంజ్‌లో ధాన్యాన్ని కుప్పచేస్తున్న రైతులు



నగరంలోని దుబ్బ ప్రాంతంలో నిలిచిన వర్షపు నీరు



పేపర్‌మిల్ సమీపంలో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన పొగాకు గట్టులు



నాగిరెడ్డిపేటలో కురుస్తున్న వర్షం

## ఎస్సారెస్పీకి 2,894 క్యూసెక్కుల వరద



మోర్తాడ్, మే 21: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువ భాగంలో వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి వరద పెరిగింది. బుధవారం ప్రాజెక్ట్‌లోకి 2,894 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1060.90 అడుగుల (11.44టీఎంసీల) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. 302 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతున్నది.

## ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఇంటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి డబ్బుల డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి మోహన్

మాక్లూర్, మే 21: ఇంటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి డబ్బులు డిమాండ్ చేసిన మండలంలోని గొట్టుముక్కల గ్రామ పంచాయతీ కార్యదర్శిని అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఘటనా వివరాలను ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ బుధవారం వెల్లడించారు. గొట్టుముక్కలకు చెందిన ముప్పడి రాజేందర్ తన ఇంటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి కట్కం మోహన్‌ను కోరాడు. దీనికి పంచాయతీ కార్యదర్శి రూ.25 వేలు లంచం డిమాండ్ చేశాడు. తాను అంతగా ఇచ్చుకోలేనని తగ్గించాలని కోరడంతో రూ.18 వేలకు ఒప్పందం కుదిరింది. ఈమేరకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఉన్న కార్యదర్శి మోహన్‌కు బాధితుడు రాజేందర్ రూ.18వేలు అందజేస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మోహన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



రాజు (ఫైల్)

రామారెడ్డి, మే 21: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని ఘన్‌పూర్(ఆర్) గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా రాజు (35) బుధవారం ఉదయం తన సొంత వ్యవసాయ పొలంలో గెట్లపై ఉన్న మొక్కలను గొడ్డలితో తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో బోరుబావికి విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీస్ వైరు ప్రమాదవశాత్తు గొడ్డలికి తగిలింది. దీంతో వైరు అతడి చేతిపై పడి షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే కుటుంబీకులకు సమాచారం ఇచ్చి, చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గమనించిన వైద్యులు అతడు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ప్రొబేషనరీ ఎస్సై నవీన్‌చంద్ర తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## రెండు దవాఖానలు సీజ్

### ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి/ ఆర్మూర్ టౌన్, మే 21: ఆర్మూర్ పట్టణంలోని పలు ప్రైవేటు దవాఖానల్లో డీఎంహెచ్‌వో రాజశ్రీ మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వైద్యశాలల్లోని రికార్డులు, ఇతర పరికరాలు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు దవాఖానలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, మెడికల్ ఆఫీసర్ నాగరాజు, పలువురు వైద్యులు ఉన్నారు.



ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానను సీజ్ చేస్తున్న నిజామాబాద్ డీఎంహెచ్‌వో రాజశ్రీ



నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం, డాక్టర్ మధు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– ఏర్గట్ల, మే 21

## అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి

- అత్తా, ఆడబిడ్డలే చంపారని బంధువుల ఆరోపణ
- దాడికి యత్నించిన మృతురాలి కుటుంబీకులు
- ఆర్మూర్‌లోని ఒడ్డెర కాలనీలో ఘటన



పూజ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, మే 21: అనుమానాస్పద స్థితిలో బాలింత మృతిచెందిన ఘటన ఆర్మూర్ పట్టణంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. అత్త, ఆడబిడ్డ కలిసి ఆమెను హత్య చేశారని బంధువులు ఆరోపించారు. ఈక్రమంలో వారిపై మృతురాలి కుటుంబీకులు దాడికి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డు ఒడ్డెర కాలనీలో రెండు నెలల బాలింత మక్కల పూజ (27) అత్త నర్సుతో కలిసి ఒడ్డెర కాలనీలోని కెనాల్ కట్ట వద్ద నివసిస్తున్నది. పూజ భర్త సాయిలు మూడు నెలల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి అత్త, కోడలి మధ్య గొడవ జరిగింది. బుధవారం ఉదయం పూజ విగతజీవిగా పడిఉన్నది. అదే కాలనీలో కిరాయి ఇంట్లో నివసించే పూజ ఆడబిడ్డ బుధవారం ఉదయం ఇంటికి వచ్చింది. అత్త, ఆడబిడ్డ కలిసి బాలింతను చంపి ఉంటారని స్థానికులు, బంధువులు అనుమానం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పూజ కుటుంబీకులు అక్కడికి చేరుకొని వారిపై దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గొడవ జరగకుండా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలికి రెండు నెలల పాప ఉన్నది. అత్త, ఆడబిడ్డను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.



పూజ ఇంటివద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీకులు, బంధువులు



చనిపోయి ఏడాదైనా బెనిఫిట్స్ ఇవ్వరా?

తన భర్త మరణానంతరం వర్తించే బెనిఫిట్స్ అందించాలని కోరు ఆయన భార్యతోపాటు కుటుంబ సభ్యులు బుధవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లోని ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ధర్పల్లి ఏవోగా పనిచేసిన ప్రవీణ్ ఏడాది క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఇప్పటివరకు మరణానంతర బెనిఫిట్స్ అందకపోవడంతో ప్రవీణ్ కుటుంబ సభ్యులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ప్రవీణ్ ఫొటోలను పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. - కంఠేశ్వర్ (నిజామాబాద్)

## ఏడీఏ సస్పెన్షన్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

### ఏవో డెత్ బెనిఫిట్స్ ఇవ్వడంలో జాప్యంపై వేటు

కంఠేశ్వర్, మే 21 : నిజామాబాద్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్పల్లి మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన ప్రవీణ్ చనిపోయి సంవత్సరం అవుతున్నా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఏవో ఫొటోతో ఈనెల 15న తేదీన కలెక్టరేట్‌లోని ఏడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నమస్తే తెలంగాణ మెయిన్ ఎడిషన్‌లో 'చనిపోయి ఏడాది అవుతున్నా బెనిఫిట్స్ ఇవ్వరా..?' అనే శీర్షికతో వార్త ప్రచురించింది. దీంతో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సింగారెడ్డి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శివాజీపాటిల్‌తో కమిషన్ వేసి, విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఏడీఏ ప్రదీప్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.